# పనికిమాలిన పని

ఉత్పత్తిలో నైపుణ్యంలో ముందున్న అమెరికాలో, పనులు ఎగ్గొట్టే వాళ్ళూ, కాలాన్నీ డబ్బునీ వృధా చేసేవాళ్ళూ, రాజకీయాలు చేసేవాళ్ళూ వుండరా అని ఒక ప్రశ్న. ఎందుకుండరూ వాళ్ళూ ఉప్పూ కారం తినే వాళ్ళే. కోపాలూ తాపాలూ వున్న వాళ్ళే. ఆశలూ అహంకారాలూ వున్నవాళ్ళే. కాకపోతే రకరకాల కారణాలవల్ల వాటిని దాచిపెట్టి ముందుకు నడవటంలో ముందున్నారు. ఎందుకని? ముందుగా ఎందుకో ఆ కారణాలూ ఆఫీసుల్లో పైన చెప్పిన అవకతవకలూ చూద్దాం. ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి. మనమే విషయం గురించి మాట్లాడుకున్నా ఏ ఉదాహరణలు చెప్పుకున్నా అవన్నీ అక్కడా ఇక్కడా జరిగేవీ చూసినవీ కానీ వాటివల్ల అమెరికాలో ఆఫీసు వాతావరణం పాడయిపోయిందని కాదు. ఉత్పత్తి కించిత్తు తగ్గిపోతుందేమో కానీ ఆగిపోతున్నదని కాదు. అలా జరుగుతుంటే ఆనాటినించీ ఈనాటిదాకా అమెరికా సంపన్నదేశంగా వుండటం కష్టం కదూ!

0 0 0

ఇంతకుముందు ఒకసారి చెప్పుకున్నాం. అమెరికాలాటి కాపిటలిష్టు దేశాల్లో కంపెనీలకి కావలసింది ఏటేటే లాభాలు. అవి చూస్తేనే షేర్ హోల్డర్స్‌కి ఆనందం. వారి ఆనందమే కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌కీ, ఎక్జిక్యూ టివ్ ఆఫీసర్ల ఉద్యోగాలకీ శ్రీరామరక్ష. బోనసుల బహుమతి ప్రదాన అవకాశం. ఇలా కంపెనీలకి లాభాలు వస్తుంటే కంపెనీకి, ఎక్జిక్యూటివ్‌లకీ, పనిచేసే ఉద్యోగులకే కాక షేర్ హోల్డర్స్‌కీ అందరికీ లాభమే. అంటే సర్వేజనా సుఖినోభవంతు అన్నమాట.

మరి పని చేయని వాళ్ళ సంగతి? కొంతమందిని కొన్నాళ్ళు, కొంతవరకూ మోసం చేయగలవేమోకానీ, కలకాలం చేయలేవని ఇంగ్లీషులో ఒక సామెత వుంది. అది నూటికి నూరుపాళ్ళు వర్తిస్తుంది. పని ఎగ్గొట్టేవాళ్ళూ, కాలాన్నీ కంపెనీ డబ్బునీ వృధా చేసేవాళ్ళూ, రాజకీయాలతో దుర్గంధం పూసేవాళ్ళూ ఎలా వున్నారో, అలాగే ఉద్యోగాలు పోయి బయటికి పోవటం కూడా చూస్తునే వుంటాం. కాకపోతే వాళ్ళు వెళ్ళే లోపల ఎంత నష్టం వస్తుందో ఎంతమంది అమాయకులు నష్టపోతారో తలుచు కుంటే బాధ వేస్తుంది. కొన్ని వ్యక్తుల ద్వారా జరిగేవయితే, కొన్ని కంపెనీ సంస్కృతు లవల్ల కూడా జరుగుతుంటాయి. అవి రెండూ ఎలా వుంటాయో చూద్దాం.

మా పాతకంపెనీలో మాక్స్ కెన్వెల్ అని ఒక సీనియర్ డైరెక్టర్ వుండే వాడు. ఆయన దగ్గర నాలాటి సీనియర్ మేనేజర్లు నలుగురు. మాదొక పెద్ద డిపార్ట్ మెంట్. ఏ పనిచ్చినా తన దగ్గర పనిచేసేవాళ్ళని పిండి పిప్పి చేసి, అనుకున్న సమ యానికి ప్రాజెక్టులు పూర్తి చేయటంలో దిట్ట. కాకపోతే మనుష్యుల్ని మనుష్యులుగా చూడడు. తన క్రింద పనిచేసేవారినే కాదు, మిగతా డిపార్ట్‌మెంట్ల మేనేజర్లనూ తదితరులనూ తక్కువ చేసి తన పనికి అడ్డం రాకుండా చూసుకుంటాడు. అడ్డం

లేకుండా లేపేస్తాడు. దానికి అవసరమైన రాజకీయాలు అవసరానికన్నా ఎక్కువగానే ప్రయోగిస్తాడు. అనుకున్న ఫలితాలు అనుకున్న సమయానికి చూపించటం ఎంతో ముఖ్యం అయినా, వ్యక్తులని గౌరవించటం అమెరికన్ సంస్కృతిలో ఒక పెద్ద భాగం. అందువల్ల మాక్స్‌కి చెడ్డపేరు రావటమే కాక మాడ్ మాక్స్ అని మాచెడ్డ పేరు (నిక్‌నేమ్) కూడా వచ్చింది. మేనేజర్లకీ డైరెక్టర్లకీ ప్రతి సంవత్సరం బోనస్‌లూ స్టాక్ ఆప్షన్లూ నిర్వర్తించిన కార్యక్రమాలను బట్టీ అనుకున్న ఫలితాలని సాధించిన దాన్ని బట్టీ వుంటాయి కనుక, ఆయనకి అదొక్కటే లక్ష్యం. ఆ లక్ష్యసాధనలో అందరిలా కాకుండా రాజకీయాలు ఉపయోగించటంలో దిట్ట. ఆయన చేసేదేమిటంటే మను ష్యులతో చదరంగమాడటం. అంటే కష్టమైన ప్రాజెక్టులో ముందు ఒక పావునో గుర్రాన్నో పనిమీద పంపిస్తాడు. వాళ్ళు బ్రతికి బట్టకడితే, వాళ్ళని కట్టుబట్టలతో ఇంకో రెండడుగులు ముందుకి పంపిస్తాడు. తనూ ఒకడుగు ముందుకు వేస్తాడు. అలాగే మళ్ళీ. ఈలోగా గొడవయితే, అంతా వాళ్ళ మీదకి తోసేసి తాను అదేదో చేసిన ముత్తయిదులా వుంటాడు. వాళ్ళని బలిచ్చేశాడు కనుక క్షుద్రదేవతలు శాంతి స్తారు. కొన్నాళ్ళు ఈ చదరంగం బాగానే నడిచింది. ఆయన చెంచాలు అలాగే కొన సాగినా, మిగతావాళ్ళు యధాశక్తి వైస్ ప్రెసిడెంట్ లెవెల్లో తమ బాధలూ, ఈయన చెస్సాట ప్రావీణ్యంలో తామెలా దెబ్బతింటున్నదీ చెప్పుకున్నారు. దాంతో ఒక శుభ ముహూర్తాన కెన్వెల్‌ని ఇక చాలు వెల్ డన్ అని కారు ఎక్కించేశారు. ఇది ఆఫీసు రాజకీయాలు ఎలా పని చేస్తాయో, పని పోయేలా చేస్తాయో చూపిద్దామని వ్రాశాను.

ఇది వ్రాస్తుంటే 1970 దశకంలో నేను త్రివేండ్రం స్పేస్ సెంటర్లో పనిచేస్తు న్నప్పుడు జరిగింది గుర్తువచ్చింది. శాటిలైట్ లాంచ్ వెహికిల్ ప్రాజెక్ట్‌కి మన ప్రస్తుత రాష్ట్రపతి కలాం డైరెక్టర్. ఏ టెస్టో ఫెయిలయినా, ప్రాకెక్ట్‌లో ఏదయినా ఆలస్యమైనా తప్పు కలాందే అనేవారు. అన్ని సరిగ్గా పోతూ టెస్టులు విజయవంతమౌతుంటే ఆహా ఓహో మేమే చేశాం అని మిగతా డివిజనల్ తలకాయలు (హెడ్స్) చంకలు కొట్టుకునేవాళ్ళు. ఆ డివిజన్ అన్న మాటలోనేవుంది అసలర్థం. (ఆహా! ఏమి ఇంగ్లీషు భాషా సౌందర్యం మరియు తెల్లవాడి బిస).

ఇండియాలోలాగానే ఇక్కడా పైన మనవాడుంటే (మనవాడంటే తెలుగు వాడు కాదుస్మీ) కనీసం కొన్నాళ్ళు ఢోకా వుండదు. జీవితం కూడా మూణ్ణాళ్ళ ముచ్చటే కనుక ఆ మూణ్ణాళ్ళూ ముచ్చటగానే వుంటుంది.

సమయం వృధా చేయటం మీద చిన్న సంఘటనలు చెబుతాను. హైటెక్ కంపెనీల్లో మేనేజర్‌గా వుంటే ప్రతి రోజూ కనీసం ఒక మీటింగన్నా వుంటుంది. గంటలో పూర్తవుతుందనే మీటింగ్ దానికి రెండింతల సమయం తీసుకోవటమూ మామూలే. అలా రోజుకి మూడు నాలుగు మీటింగులకి వెళ్ళే మేనేజర్లూ వున్నారు. మీటింగ్ నడిపే అతను దాన్ని ఒక పద్ధతిలో నడపటానికి ప్రయత్నం చేస్తుంటే, ఎవరికి తోచిన విధంగా వాళ్ళు ఎటుపడితే అటు లాగి మోకాళ్ళడ్డు పెట్టటం కూడా చూస్తూంటాం. చాల ఏళ్ళ క్రితం జరిగిన ఒక సంఘటన చెబుతాను. నేనప్పుడు ఒక కంపెనీకి ఇంజనీరింగ్ మేనేజర్‌గా పనిచేసేవాడిని. ఒకసారి కొంతమంది కష్టమర్లకి

సేల్స్ ప్రెజంటేషన్ ఇస్తున్నాం మా సేల్స్ మేనేజరూ, నేనూ. మా కంపెనీ ప్రెసిడెంట్ కూడా అక్కడే వున్నాడు. ఒక ఏరోస్పేస్ కంపెనీనించీ నలుగురైదుగురు కష్టమర్లు వచ్చారు. అసలు పద్ధతేమిటంటే, సేల్స్ మేనేజర్ కొంచెం ఉపోద్ఘాతం చెప్పటం, తర్వాత మా ప్రెసిడెంట్ కంపెనీ గురించి మాట్లాడటం. తర్వాత నా టెక్నికల్ ప్రెజంటేషన్. తర్వాత కష్టమర్ల కష్టాలూ సమస్యలూ తెలుసుకుని సాంకేతికపరంగా, బిజినెస్‌పరంగా జవాబు చెప్పటం. నా ప్రెజంటేషన్ ముందుదాకా బాగానే నడిచింది. నేను లేచి మా ప్రాడక్టుగురించి చెబుతున్నాను. కష్టమర్లుకూడా శ్రద్ధగా వింటున్నారు. నోట్స్ వ్రాసుకుంటున్నారు. ఇందాక చెప్పానే మోకాళ్ళు అడ్డుపెట్టేవాళ్ళుంటారని. మా సేల్స్ మేనేజర్ విక్‌కి మోకాలు దురద పెట్టటం మొదలయింది. ఒకటి రెండుసార్లయితే ఫరవాలేదు. అలా పట్టువదలని మా విక్రమార్కుడు, నేను ఒకటి చెబితే దానికి నాలుగింతలు చెప్పి అడ్డం రావటం మొదలుపెట్టాడు. నాకేకాక అందరికీ అభ్యంతరంగానే వుంది. మా ప్రెసిడెంట్ కూడా నా వేపూ, విక్ వేపూ చూస్తున్నాడు. ఇక లాభంలేదని, నవ్వుతూ ఒక జోక్‌లా 'విక్! నాకన్నా కూడా మంచి ఉత్సాహంగా వున్నావివాళ. ఈ ప్రెజంటేషన్ నువ్వే చెయ్యరాదూ. నేను సేల్స్‌లో చేరతాను. నువ్వు ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌ని నడుపు' అని కూర్చున్నాను. అతను అది ఊహించలేదేమో ఒక్కనిమిషం ఏమీ మాట్లాడలేదు. మా ప్రెసిడెంట్ ఆ సంఘటనని పూర్తిగా ఒక జోకులా మారుస్తూ, 'నేను ఒప్పుకోను. సత్యం ఇంజనీరింగ్‌లో వుండాలి. విక్ సేల్స్‌లో వుంటాడు...' నవ్వుతూ అని, నా వేపు తిరిగి ఇక కొనసాగించమన్నాడు. అందరూ వెళ్ళిపోయాక, విక్‌ని పిలిచి నాకు అపాలజీ చెప్పమని చెప్పాడు.

అది ఒక అనుభవం అయితే ఇది ఇంకొక రకం. ఈ మీటింగ్స్‌కి అనవసరమైన వాళ్ళనందరినీ పిలిచి, అలా సమయం వృధా చేయటం గురించి ఒకసారి మా డైరెక్టర్‌తో మాట్లాడుతున్నప్పుడన్నాను. 'ఈ మీటింగుల్లో కొంతమందితో అవసరం ఐదో పదో నిమిషాలకన్నా వుండదు. వాళ్ళనంతేసేపు కూర్చోపెట్టటం దండగ' అని. అప్పుడు కాస్ట్ రిడక్షన్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను కనుక, ఆయన నావేపు తిరిగి 'అయితే ఏం చేద్దామంటావు?' అన్నాడు. అప్పుడే ఒక చిన్న ప్రాజెక్ట్‌కి అంకురార్పణ జరిగింది. దానిమీద చిన్న రిపోర్ట్ ఇవ్వటమూ, వారం రోజుల్లో దాన్ని ఆచరణలో కూడా పెట్టాము. ఫలితాలు చూసి అందరూ గుండెలు బాదుకున్నారు. మేం చేసింది చాల చిన్న పని. ప్రతి మీటింగ్‌కీ వచ్చినవాళ్ళు, వాళ్ళ పేర్లూ ఎంతసేపు వున్నదీ కాగితం మీద వ్రాస్తే చాలు. ఇరవై నాలుగు గంటల్లో వాళ్ళు ఒక్కొక్కళ్ళ జీతం నాలుగు గంటలకి ఎంతో లెఖ్ఖలు వేసి, మీటింగ్ ఖర్చు ఎంతో మీటింగ్ నిర్వహించిన అతనికి, డిపార్ట్‌మెంట్ డైరక్టర్‌కి పంపిస్తారు. ఒక్కొక్క మీటింగు ఖర్చు వేల డాలర్లు అని తేలేటప్పటికీ అందరికీ గాబరా పుట్టింది. అసలు వృధా చేస్తున్న సమయం ఎక్కడో తెలిసిపోయింది. ఇలాటివి అమలుచేసేటప్పుడు బాగుంటాయి. కానీ మళ్ళీ కంపెనీ లాభాల్లో పడ్డాక, వీటి సంగతి మరిచిపోయి మళ్ళీ మొదటికి వస్తాయి. చెప్పుకోటానికి ఇలాటివి చాల వున్నాయి.

0 0 0